సంక్షేమ పథకాలతో వెలుగులు

- మంత్రి జోగి రమేష్
- డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేత



కాటూరులో ఆసరా చెక్కు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

ఉయ్యూరు: దేశంలోని 28 రాష్ట్రాల్లో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని విధంగా స్వయం సహాయక సంఘాల్లోని అక్కచెల్లెళ్లకు రుణమాఫీ అమలు చేస్తున్న ఏకైక సీఎం జగనన్న అని మంత్రి జోగి రమేష్ పేర్కొన్నారు. 2019లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. మండలంలోని కాటూరు జెడ్పీ పాఠశాల, ఉయ్యూరు ప్రధాన సెంటరులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కాటూరు, ముదునూరు, బోళ్ల పాడు, కలవపాముల, సాయిపురం, కడవకొల్లు గ్రామాలకు సంబంధించిన 437 స్వయం సహాయక సంఘాలకు రూ.3.23 కోట్లు వైఎస్సార్ ఆసరా సొమ్ము విడుదల కావటంతో చెక్కును అక్కచెల్లెళ్లకు అందించారు. ఉయ్యూరు పట్టణంలో 5809 మందికి రూ.6.38 కోట్లు ఆసరా సొమ్ము విడుదలైంది.సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందరర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు రుణ పరపతిని రూ.20 లక్షలకు పెంచిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే నన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కాటూరు సభల్లో ఎంపీపీ చీలి కల్పన, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్‌లు తుమ్మూరు సురేష్‌రెడ్డి, పానుగుమాటి బాలస్వామి, మంగినేని సుధారాణి, వైస్ ఎంపీపీ గంజి వెంకట స్వర్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు. ఉయ్యూరు సభలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, గోన మదన్, రాజులపాటి చిన్ని, ఊర శ్రీవాణి, ఎండీ బేగ్, తెనాలి పద్మావతి, కూరాడ వెంకట లక్ష్మి, డాక్టర్ జంపాన పూర్ణిమ పాల్గొన్నారు. డ్వాక్రా స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

జగనన్నే మళ్లీ సీఎం..



నా భర్తతో కలిసి కలవపాములలో న్యూడిల్స్ బండి నడుపుకుంటున్నాం. వ్యాపారం వృద్ధి చేసుకోవటానికి డ్వాక్రా రుణం తీసుకుని పెట్టుబడులు పెట్టాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా నాలుగో విడత కూడా నాకు ఆసరా అందింది. ఏటా రూ.11,258 అందుతోంది. దాంతో పాటు చేయూత రూ.18,750 ఇస్తున్నారు. ప్రభుత్వం మా కుటుంబానికి అందిస్తున్న పథకాలతో వ్యాపారం చేసుకుంటూ రోజుకు రూ.1000 వరకూ సంపాదిస్తున్నాం. ఆనందంగా జీవిస్తున్నాం. మా బోటి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న జగనన్నే మళ్లీ సీఎం కావాలి. ఆయనే మా సీఎం.

– కలపాల సత్యమణి, న్యూడిల్స్ షాపు నిర్వాహకురాలు, కలవపాముల

నా బిడ్డ లండన్‌లో చదువుతున్నాడు..



కడవకొల్లు గ్రామంలో నేను, నా కుటుంబం కిరాణా షాపు నడుపుతున్నాం. వైఎస్ రాజశేఖరరెడ్డి తొలుత మా జీవితాల్లో వెలుగులు నింపారు. హరియాణా గేదెలను ఇవ్వడంతో జీవనం సాగించాం. 2006లో ఇంటి స్థలం కూడా ఇచ్చారు. జగనన్న వచ్చాక నాలుగో విడతగా రూ.17,700 ఆసరా వచ్చింది. ఆసరా, చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అందుకోగలిగాం. రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకూ సంపాదిస్తున్నా. బీటెక్ పూర్తి చేసిన నా బిడ్డను విదేశీ విద్యాదీవెనతో లండన్‌లో చదువుకుంటున్నాడు. నా ఇంకో బిడ్డ ఇంటర్. మళ్లీ మా జగనన్నే సీఎం కావాలి.

–పచ్చిగళ్ల లత, కిరాణాషాపు నిర్వాహకురాలు, కడవకొల్లు

క్లుప్తంగా

కాలేజీ ఉద్యోగి కుటుంబానికి సాయం



పెనమలూరు: కానూరు పీవీపీ సిద్ధార్థ కాలేజీలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగి పి.మోహన్‌రావు కుటుంబానికి కాలేజీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు శనివారం ఆర్థిక సాయం అందించారు. కాలేజీలో పని చేసిన మోహనరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కాలేజీ యాజమాన్యం రూ. 3.20 లక్షలు, సిబ్బంది, విద్యార్థులు రూ.3.23 లక్షలు కలిపి రూ.6.43 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి ఎం.లలితప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్యామ్ పాల్గొన్నారు.

మహిళల క్రికెట్ విజేత 'ఉయ్యూరు'



పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా శనివారం జరిగిన మహిళల క్రికెట్ పోటీల్లో ఉయ్యూరు జట్టు విజయం సాధించింది. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం మహిళల క్రికెట్ ఫైనల్ పోటీ రసవత్తరంగా జరిగింది. ఉయ్యూరు జట్టు కంకిపాడు జట్టుపై 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉయ్యూరు జట్టులో ఫాతిమా, భవ్యశ్రీ ఉత్తమ ప్రతిభ చూపారు. గెలుపొందిన జట్టు జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటుంది. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు ఎంపీడీఓ విమాదేవి, ఏవో లోయ శివశంకర్‌రావు, తాడిగడప మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. పురుషుల క్రికెట్ ఫైనల్ పోటీలు సోమవారం జరుగుతాయని అధికారులు తెలిపారు.

విద్యార్థికి బంగారు పతకం



పెనమలూరు: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి ఉప్పల సాయిసుబ్రహ్మణ్యం సాఫ్ట్‌బాల్ పోటీలో బంగారు పతకం సాధించాడు. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పోతిన రఘు శనివారం వివరాలు వెల్లడించారు. కాలేజీలో ఎంసీఏ చదువుతున్న ఉప్పల సాయిసుబ్రహ్మణ్యం ఈ నెల 13వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన 20వ సీనియర్ సౌత్‌జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించాడన్నారు. ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ డీన్ బావినేని పాండురంగారావు ఎంసీఏ విభాగాధిపతి జ్యోతి విద్యార్థిని అభినందించారు.

శ్రీరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ఈవో కేఎస్.రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీస్వామివారికి అభిషేకం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఈవో రామారావును శేషవస్త్రాలతో సత్కరించి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు. ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈవో రామారావు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్, పలువురు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


బోరు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

రామవరప్పాడు: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని రామానగర్, నెహ్రూనగర్, ముస్లిం శ్మశానం గ్రౌండ్‌లో జరుగుతున్న మంచినీటి బోర్‌ల నిర్మాణ పనలను శనివారం రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన సుమారు రూ.2 కోట్ల నిధులతో గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామం మొత్తం జరుగుతున్న నూతన మంచినీటి పైప్‌లైన్ విస్తరణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయన్నారు. సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రాంతాల వారీగా మంచినీటి బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో నూతన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను కూడా నిర్మించనున్నట్లు వివరించారు. ఈ నిర్మాణ పనుల ద్వారా సంవత్సరాల తరపడి ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ పరిశీలనలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో విజేత గన్నవరం జట్టు


మహిళల కబడ్డీ విన్నర్, రన్నర్ జట్లతో అధికారులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే బ్యాడ్మింటన్ డబుల్స్, ఖోఖో పురుషులు, మహిళల విభాగంలో పోటీలు ముగిశాయి. క్రీడా సంబరాల్లో భాగంగా శనివారం కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పురుషుల విభాగంలో గన్నవరం జట్టు విజేతగా నిలవగా విజయవాడ రూరల్, బాపులపాడు జట్లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ మహిళల విభాగంలో గన్నవరం జట్టు ప్రథమ స్థానం సాధించగా, విజయవాడ రూరల్, ఉంగుటూరు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పురుషులు, మహిళలు విభాగాల్లో విజేతగా నిలిచిన గన్నవరం జట్లు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త డి.నాగరాజు తెలిపారు. ఈ పోటీలను ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రత్యేకాధికారి మహ్మద్ హాజీబేగ్, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి. వెంకటేశరమ్మ పర్యవేక్షించారు. ఈ నెల 29న జరిగే వాలీబాల్, క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లతో నియోజకవర్గ స్థాయి పోటీలు ముగియనున్నట్లు హాజీబేగ్ తెలిపారు. కేవీఆర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్, పంచాయతీ కార్యదర్శి బాపూజీ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతోనే వ్యక్తిత్వ వికాసం

పటమట(విజయవాడతూర్పు): క్రీడలతోనే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని, క్రీడలు అందరికీ ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్(శాప్) కోచ్ వినాయక్ ప్రసాద్ అన్నారు. స్టెల్లా కళాశాలలో శనివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పుస్తకాలు చదవటంతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మరో అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి, ఘంటసాల ఎంపీడీఓ అనూహ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ జీవితంలో విజయం సాధించాలనే లక్ష్యం ఉండాలన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రణాళిక రూపొందించాలని, ఆ మేరకు ప్రతి ఒక్కరూ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖ, కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రాస్, క్రీడా కోచ్‌లు రాజా, సునీత, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఉషాకుమారి, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లిటిల్ ఫ్లవర్ డాక్టర్ లావణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

బంటుమిల్లి: పెందుర్రు గ్రామం వద్ద పోలీసులు శనివారం 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేశారు. గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీ చేస్తుండగా కృత్తివెన్ను మండలం నీలిపూడి గ్రామానికి చెందిన ఉద్దగిరి ఫణి పలు కంపెనీలకు చెందిన రూ. 4200 విలువ చేసే 30 మద్యం సీసాలతో వెళ్తుండగా అతన్ని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఫణిపై కేసు నమోదు చేసి సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ పైడిబాబు తెలిపారు. మండలంలో అక్రమ మద్యం, సారా విక్రయించినా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సందడి



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

2012–2023 మధ్య చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2012 నుంచి 2023 వరకు చదివిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. కళాశాలలో పలు విభాగాల్లో ఇంజినీరింగ్ పూర్తి చేసి, దేశంలోని వివిధ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడినవారు అల్యూమ్ని అసోసియేషన్ ద్వారా సుమారు 150 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తొలుత కళాశాల మొత్తం కలియ తిరిగి విద్యార్థి ప్రాయంలో తాము చేసిన అల్లరి పనులు తలుచుకున్నారు. తమ తమ తరగతి గదులకు వెళ్లి కొద్ది సేపు ముచ్చటించుకుని విద్యార్థులుగా మారిపోయారు. ఒకరినొకరు నిక్‌నేమ్‌లతో పిలుచుకుని ఆట పట్టించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించారు. వారిని సన్మానించి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ కళాశాలలో విద్యా బుద్ధులు నేర్చిన పూర్వ విద్యార్థులు ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లు, ఉద్యోగాల కల్పన వంటి విషయాలపై ప్రస్తుత విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం జూనియర్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అల్యూమ్ని అసోసియేషన్ సెక్రటరీ వంశీకృష్ణ, కో ఆర్డినేటర్ కృష్ణయ్య, పలు విభాగాల అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అభిప్రాయాల సేకరణ

గుడివాడ ఈఈ రామకృష్ణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31వ తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు సీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి 4.30 వరకు అభిప్రాయ సేకరణ జరుగుతుందని వివరించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత వార్షిక ఆదాయం, అవసరాలు, రిటైల్ ధరలపై విద్యుత్ వినియోగదారుల అభిప్రాయాలను తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ క్రాప్ నమోదు ఆకస్మిక తనిఖీ



కంకిపాడు: ఈ క్రాప్ నమోదు సమర్థంగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి ఆదేశించారు. మండలంలోని దావులూరు, కంకిపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం జిల్లా వ్యవసాయాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రాప్ నమోదు తీరును పరిశీలించారు. రికార్డుల నమోదు, వాస్తవ పరిస్థితిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగుకు అవసరమైన చేయూత అందించేందుకు ఈ క్రాప్ దోహదపడుతుందన్నారు. పంట కొనుగోళ్లు, పంట నష్టపరిహారం అందజేతలో ఎలాంటి అవరోధాలు లేకుండా ఉంటాయన్నారు. ఈ క్రాప్ వల్ల ప్రయోజనాలను అర్థం చేసుకుని ప్రతి రైతు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దాడి కేసు నిందితులు

గన్నవరం: రియల్ ఎస్టేట్ వివాదాల నేపథ్యంలో గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసిన కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరి నుంచి దాడికి సంబంధించి కీలక సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద ఈ నెల 21న రంగబాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ జయసూర్య నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాల్‌డేటా ఆధారంగా హైదరాబాద్‌లోని పాతబస్తీలో దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వ్యక్తులను కూడా పట్టుకునేందుకు పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న రంగబాబుతో వివాదస్పద భూమి కొనుగోలు విషయమై హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కిరాయి వ్యక్తులతో ఈ దాడి చేయించినట్లుగా తేలుస్తోంది. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం ఈ కేసుకు పూర్వపరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

రేపు బాబా ఆలయ వార్షికోత్సవం

ఉంగుటూరు: మండలంలోని ఇందుపల్లిలో షిరిడీ సాయిబాబా, విఘ్నేశ్వర, దత్తాత్రేయ స్వామివార్ల ఆలయం 23వ వార్షికోత్సవం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వక్కలగడ్డ రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారు జామున 4గంటల నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు అన్నసమారాధన

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం అయ్యప్పస్వామి అన్నసమారాధన నిర్వహించనున్నారు. గ్రామంలో గత 44 సంవత్సరలుగా గ్రామస్తులు, భక్తుల అయ్యప్పస్వామి అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయ 11 గంటల నుంచి గ్రామంలో అయ్యప్పస్వామి అన్నసమారాధన నిర్వహిస్తారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

కష్టపడే కార్యకర్తకు సముచిత స్థానం

మంత్రి జోగి రమేష్



ఉయ్యూరు: కష్టించి పనిచేసే కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాంను శనివారం మంత్రి రమేష్ పరామర్శించారు. ఆయన ఇంటి వద్ద మైనార్టీ నాయకులతో మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. అందరూ జగనన్నతోనే నడిచి మళ్లీ సీఎంను చేసుకుందామన్నారు. అనంతరం ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన ఇరువురు వ్యక్తుల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల ఒకే రోజు చనిపోయిన భార్యాభర్తలు నందం పాండురంగారావు, కమల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మండలంలోని కాటూరు గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన వేపూరి బుజ్జి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వ పరంగా పూర్తిగా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా స్థాయి పద్య పఠన పోటీల్లో ప్రతిభ



హనుమాన్‌జంక్షన్ రూరల్: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి తెలుగు పద్య పఠన పోటీల్లో బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని చైత్రి సునీత ప్రతిభ చాటుకుంది. గణతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకల్లో కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదగా చైత్రి సునీత ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నట్లు హెచ్‌ఎం పి.నిర్మల శనివారం తెలిపారు. బహుమతి పొందిన సునీతను ఎంఈవో–1 శ్రీరామ్ బాలాసింగ్, ఎంఈవో–2 బి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి బి.రంగనాథ్‌బాబు శనివారం పరిశీలించారు. నున్న గ్రామంలో కోటకట్ట సెంటర్లో ఎలిమెంటరీ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు, మంచినీటి వసతి, టాయిలెట్స్, విద్యుత్ సదుపాయం, చదునుగా ఉండే ఫ్లోరింగ్ సదుపాయం, పోలింగ్ కేంద్రాల్లో గోడలపై ఎలాంటి రాతలు లేకుండా ఉండాలని, చుట్టూ ప్రహరీ నిర్మాణం లాంటి సదుపాయాలు ఉండాలని సెక్టార్ అధికారి రెవెన్యూ సిబ్బందికి సూచించారు. నున్న గ్రామంలో మొత్తం 13 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో 7 పోలింగ్ కేంద్రాలు, ఎలిమెంటరీస్కూల్లో 3, రెండవ, మూడవ సచివాలయాల్లో రెండు పోలింగ్ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రంలో ఒకటి చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ఆయన తెలిపారు.